క్లుప్తంగా

గురువుకు సత్కారం



కోలాటం,లలిత పారాయణ నేర్పిన గురువును సత్కరిస్తున్న శిష్యబృందం

మల్కాపురం: తమకు విద్య నేర్పిన గురువు పాదాలను కడిగే అవకాశం తమకు లభించడం అదృష్టంగా భావిస్తున్నామని కోలాట బృంద సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. 61వ వార్డు వెంకన్నపాలెంలో నీలాతి గుణవతి అనే మహిళ శ్రీకృష్ణ ఆలయంలో పదేళ్ల నుంచి మల్కాపురం,ఆర్‌కేపురం,వెంకన్నపాలెం,ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన మహిళలకు కోలాటంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం గుణవతి దంపతులను సత్కరించారు.

నిరాశ్రయుడికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



నిరాశ్రయుడిని షెల్టర్‌కు తీసుకొస్తున్న మమత

విశాఖ విద్య: ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తికి ఆదివారం బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. పరవాడ ఏరియాలో ఫుట్‌పాత్‌పై కొన్ని రోజులుగా ఓ వ్యక్తి ఉంటున్నాడనే సమాచారంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న అతనికి ఎవరూ లేరని తెలుసుకొని సపర్యలు చేసి షెల్టర్‌కు తీసుకొచ్చారు. మతిస్థిమితం కూడా సరిగా లేకపోవడంతో అతనికి అవసరమైన వైద్యం అందించే ఏర్పాట్లు చేసినట్లు మమత తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

గోపాలపట్నం: ఎన్ఏడీ జాతీయ రహదారి బస్ స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదానం చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం : రక్తదానం ఎంతో గొప్ప విషయమని, తద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని భీమిలి సీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కై తపల్లి శ్రీనివాసరావు అన్నారు. కీతిన్‌పేటలో అసోసియేషన్, యరబాల చారిటీ సమయుక్తంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో అవసరమైన వారికి తమ వంతు సాయం అందివ్వడానికి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యరబాల చారిటీ చైర్మన్ యరబాల ప్రసాద్ మాట్లాడుతూ తరచూ ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారిని వెంటనే ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 80 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు బ్లిస్ క్యాటరింగ్స్ ఎండీ లక్ష్మీ లావణ్య బహుమతులు అందించారు. గంటా నూకరాజు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్ని, ఎ.కిశోర్, ఆర్.బసవ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



వేణుగోపాలస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



బాబా పల్లకీ సేవలో డిప్యూటీ మేయర్ శ్రీధర్



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో బాబాను దర్శించుకుని పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు



సాయిబాబా దర్శనానికి వచ్చిన ఎంపీ భరత్

- మార్మోగిన సాయినామ స్మరణ
- పలు చోట్ల భారీ అన్న సమారాధనలు



62వ వార్డులో షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: గురుపౌర్ణమి వేడుకలను పారిశ్రామిక ప్రాంతంలోని పలు సాయిబాబా ఆలయాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయంలో సాయినాధుడికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు,విభూది అభిషేకం చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మధ్యాహ్నం సుమారు 3 వేల మంది భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. బాబాను విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పి.గణబాబు కుమారుడు మౌర్య దర్శించుకున్నారు.

- పవనపుత్రకాలనీలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువు దీరిన సాయిబాబాకు ప్రత్యేక పూజు జరిగాయి. సాయిబాబా విగ్రహ దాత వియ్యపు సన్యాసిరావుయాదవ్, ఆలయ మిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.
- 59వ వార్డు గాజువాక డిపో వద్ద సాయిబాబా ఆలయంలో నిర్వహించిన పూజల్లో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, ఆలయ చైర్మన్ పుర్రె అప్పరావుయాదవ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనగర్ ఈ బ్లాక్ షిర్డీ సాయిబాబా ఆలయంలో విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ప్రశాంతినగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఉదయం భక్తులు క్షీరాభిషేకాలు చేశారు. 1008 రొట్టెలతో అర్చన చేశారు.

- జీవీఎంసీ 91,92 వార్డుల్లోని పలు ఆలయాల్లో బాబాను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాత గోపాలపట్నం, ప్రశాంతినగర్, లక్ష్మీ నగర్, ఆర్ఆర్ వీపురం ప్రాంతాల్లో ఆలయాలను సందర్శించి బాబాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో బండి దుర్గేష్, తెలుకల రమేష్, పొట్నూరు శంకర్, నీలాపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్చనలు.. అభిషేకాలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు అంబేడ్కర్ నగర్, 90వవార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయి ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబేడ్కర్ నగర్ కాలనీలోని సాయినాధుని ఆలయాన్ని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్ దంపతులను శాలువతో సత్కరించారు. ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయి ధ్యాన మందిరంలో సాయి నామస్మరణ మార్మోగింది.

ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీ గాంధీగ్రామంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో బాబాకు మంగళస్నానంతో పాటు 108 కలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ షిర్డీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.



ఏపీఎస్ఈబీ కాలనీలో పూజలందుకున్న సాయిబాబా

- జీవీఎంసీ 62వ వార్డు గుడివాడఅప్పన్నకాలనీ, త్రినాథపురం, ప్రకాష్‌నగర్, తదితర ప్రాంతాల్లోని షిర్డీసాయిబాబా ఆలయాల్లో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దంపతులు సాయిబాబుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ



సమావేశంలో పాల్గొన్న గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం తొలి సమావేశం ఆదివారం నిర్వహించారు. 1963 నుంచి 2024 వరకు చదువుకున్న విద్యార్థులు ఇటీవల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యవర్గం సమావేశమై భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కార్యాచరణపై చర్చించారు. పూర్వ విద్యార్థులను సమీకరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. మరో సమావేశం నిర్వహించి అందరి సభ్యుల ఆలోచనలు సమీకరించి నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మజ్జూరి శ్రీనివాస్, కార్యదర్శి వైఎస్ ప్రసాద్, సహాయ కోశాధికారి కోనేటి సత్తబాబు, ఉపాధ్యక్షుడు మేడిది రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీను



కంచరపాలెం పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఏఎస్ఐ ఆదిరాజు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మర్రిపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని కంచరపాలెం ఐదో పట్టణ ఏఎస్ఐ ఆదిరాజు సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకూడదని, గొడవల్లో తలదూర్చకూడదన్నారు. నేరాల జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్లప్పుడూ రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఉంటుందని, బుద్ధిగా నడుచుకోవాలని సూచించారు.

కూలిన ఇంటి శ్లాబ్

కుటుంబానికి తప్పిన ప్రమాదం



ఇంట్లో పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

కంచరపాలెం: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల ధాటికి ఓ ఇంటి శ్లాబ్ నానిపోయి నిద్రిస్తున్న ఓ కుటుంబంపై కూలిపోయింది. ఈ ఘటన 47వ వార్డు కప్పరాడ కొండ సమీపంలోని అరుధంతినగర్‌లో దేవి, భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్న ఇంట్లో జరిగింది. వర్షాల కారణంగా శ్లాబ్ పైకప్పు నానిపోయి, ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌తో సహా శనివారం రాత్రి మంచంపై నిద్రిస్తున్న పిల్లలపై ఒక్కసారిగా పడిపోయింది. అదృష్టవశాత్తు వారంతా తప్పించుకుని స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరి పిల్లల కాళ్లు, చేతులకు స్వల్పగాయలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు అక్కడికి చేరుకుని, సంబంధిత అధికారులకు తెలియజేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకు వెళ్తామని వారు హామీ ఇచ్చారు.

పూడికల తొలగింపు



గేట్లు ఎత్తి పూడికలు తొలగిస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్ గెడ్డలో పూడికలను ఆదివారం తొలగించారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఎగువ ప్రాంతం నుంచి మురుగు, వ్యర్థాలు గెడ్డ వద్ద భారీగా పేరుకుపోయాయి. కాలనీ వాసులు సమస్యను ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన వార్డు పారిశుధ్య అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పొక్లెయిన్ సాయంతో వ్యర్థాలను తొలగించారు.



గొడుగులు వేసుకుని గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



కుమారుడిని భుజాలపై మోస్తూ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తుడు

వర్షంలోనూ సాగిన భక్తజనం

సేవా కార్యక్రమాల కొనసాగింపు



భక్తులకు ఇడ్లీలు అందిస్తున్న ఆటో అసోసియేషన్ సభ్యులు



భక్తులకు బిస్కెట్ ప్యాకెట్లు అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు వర్షం ఇబ్బంది కలిగించినా ఆగలేదు. గొడుగులు వేసుకుని కొందరు.. తడిస్తూనే మరి కొందరు భక్తులు అప్పన్న చెంతకు చేరారు. చిన్న పిల్లలను భుజాలపై మోసుకుంటూ తల్లిదండ్రులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.


అర్ధరాత్రి దాటినా సేవా కార్యక్రమాలు

భక్తులకు సేవలు అందించడమూ పుణ్యమే అనే భావనతో పలువురు, పలు సంస్థలు భక్తులకు సేవలు అందించారు.

అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా భక్తులకు తినుబండారాలు, దాహార్తి తీర్చే పానీయాలు అందించారు. బాజీ జంక్షన్ వంశీసూపర్ మార్కెట్ వద్ద ఆటో అసోసియేషన్ సభ్యులు మాత్రం రాత్రాంతా పండ్లు, టీలు, మంచినీరు, టిఫిన్లు అందించారు. ఉదయం కూడా వేడి వేడి ఇడ్లీ అందించి భక్తుల ఆకలి తీర్చారు.

అంగన్‌వాడీ చదువులు అంతంతే..

- ఇంకా చేరని పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే బోధన
- ప్రైవేట్ స్కూళ్ల వైపు తల్లిదండ్రుల చూపు



పీపీ - 1 పుస్తకం



పీపీ - 2 పుస్తకం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న టీచర్

పెదగంట్యాడ: బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మలు, పుస్తకాలను ఆయా కేంద్రాలకు అందజేసేది. కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆంగ్ల బోధన అందించాలనే ఉద్దేశంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ – 1, పీపీ – 2 కిట్లు అందించింది. ఈ కేంద్రాల్లో ప్రైవేట్ స్కూల్ తరహాలో ఆంగ్ల బోధన అందించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఆసక్తి చూపేవారు. బోధనకు సంబంధించి 2 నుంచి 4 ఏళ్లలోపు చిన్నారులకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ – 1 కిట్లు, 4 నుంచి 5 ఏళ్ల వయసు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ – 2 కిట్లు అందించేవారు.

పాత పద్ధతిలోనే బోధన

పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి పెదగంట్యాడ సెక్టార్‌లో 25 కేంద్రాలు ఉండగా ఇస్లాంపేట సెక్టార్ పరిధిలో 26 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో సుమారు 3 వేల మంది వరకూ చిన్నారులు ఉన్నారు. వీరికి ఇప్పటి వరకూ పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలు నేటి వరకు అందకపోవడంతో పాత పద్ధతిలోనే పాఠాలు బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా కొత్త ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. గత ప్రభుత్వంలో సకాలంలో పుస్తకాలు అందించడంతోపాటు వాటిలో చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండడంతో తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. నేడు పుస్తకాలు రాకపోవడంతో ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లలో చేర్పించడానికి సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని బాలల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పుస్తకాలు రాలేదు

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త పుస్తకాలు ఇంకా ప్రభుత్వం నుంచి రాలేదు. పాత పుస్తకాలలోని కొంతమేర సిలబస్ మార్చే అవకాశం ఉంది. పుస్తకాలు వచ్చిన వెంటనే అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తాం. ప్రస్తుతం ఉన్న పుస్తకాలతోనే బోధిస్తున్నాం.

– నీలవేణి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి

మిత్రుడి కుటుంబానికి రూ.25 వేల సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మల్లునాయుడు పాలెం జెడ్పీపాఠశాల పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమ ఉదారత చాటుకున్నారు. పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి తమతో కలిసి చదివి ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందిన అయ్యన్నపాలేనికి చెందిన బొమ్మ ఆంజినేయులు కుటుంబానికి ఆదివారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడుతో పాటు లావేటి రవికిరణ్,కోన గణేష్,గండి త్రినాథ్,తుంపాల శివ,నక్కెళ్ల రామునాయుడు, గండ్రెడ్డి బాలరాజు,నేబర్తి కృష్ణ,గండి గజపతి నాయుడు తదితరులు ఉన్నారు.